క్లుప్తంగా

స్వామి సన్నిధిలో జస్టిస్ శ్రీనివాసరాజు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శనివారం తూర్పుగోదావరి జిల్లా వినియోగదారుల కమిషనర్, జస్టిస్ రాయుడు శ్రీనివాసరాజు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు జస్టిస్, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని జస్టిస్ శ్రీనివాసరాజుకు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

నూకాలమ్మ హుండీ ఆదాయం రూ.91,297



హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

మలికిపురం: గూడపల్లిలో వేంచేసిన నూకాలమ్మ వారి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు శనివారం జరిగింది. రూ.91,297 ఆదాయం వచ్చింది. లెక్కింపును దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు, కార్య నిర్వహణాధికారి గంధం సత్యనారాయణ, సర్పంచ్ సుందర తాతాజీ, పెచెట్టి నరసింహస్వామి, గుబ్బల శేషారత్నం నాగ వెంకట సత్యనారాయణ, సుందర బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

అయినవిల్లి: వీరవల్లిపాలెంలో నాగసాయి ప్రైమరీ ఐ కేర్, ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఈ వైద్య శిబిరం ప్రారంభించారు. వైద్యులు రోగులకు కంటి పరీక్షలు, తలనొప్పి, పార్శ్వనొప్పి, దూర దృష్టి, ఇతర దృష్టి లోపాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. మొత్తం 105 మంది రోగులు పరీక్షలు చేశారు. ఐదుగురికి కంటి ఆపరేషన్లకు సిఫారసు చేశారు.

రికార్డుల తనిఖీ



పెనికేరు వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

ఆలమూరు: మండలంలోని పెనికేరులోని వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం రికార్డుల తనిఖీ జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ ఆదేశాల మేరకు సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, సూపర్‌వైజర్ ఎం.శ్రీనివాసరావు స్థానిక వెల్‌నెస్ సెంటర్‌కు వెళ్లి గ్రామస్తులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యారోగ్యశాఖ రూపొందించిన యాప్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి వైద్యారోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఏఎన్‌ఎంలు టి.సుశీల, జి.రాధామణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట కాలువలో పూడికతీత

ఆలమూరు: మండలంలోని జొన్నాడ నుంచి వెదురుమూడి వరకూ ప్రవహించే పంట కాలువలో పూడికతీత పనులు జరిగాయి. శివారు ప్రాంతాలకు నీటి ఎద్దడి విపరీతంగా ఉందని రైతులు ఆవేదన చెందడంతో స్పందించిన చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస చౌదరి శనివారం పొక్లెయిన్ సాయంతో పూడిక తీయించారు. స్థానిక పినపళ్ల నుంచి వెదురుమూడి మలుపు వరకూ ఈ పనులు చేపట్టారు.

సీనియర్ పాత్రికేయుడు 'చింతం' మృతి



చింతం వెంకటేశ్వరరావు (ఫైల్)

కొత్తపేట: నియోజకవర్గంలో సీనియర్ పాత్రికేయుడు చింతం వెంకటేశ్వరరావు (70) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కుమార్తె ఇంట ఉంటున్నారు. తెల్లవారుజామున ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని స్వగ్రామం మందపల్లి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. పాత్రికేయుడు వెంకటేశ్వరరావు మృతికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

రేపు మండల పరిషత్ సమావేశం

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ సరోవర్ తెలిపారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. సమావేశానికి వచ్చే మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలన్నారు.

నేటి తప్పు.. భావితరాలకు ముప్పు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వాడకం
- రేపటి పౌరుల మనుగడపై తీవ్ర ప్రభావం



మాచవరం పంట కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అంబాజీపేట: ఉదయం లేచింది మొదలు పాలు, టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సామాన్లు.. ఒక్కటేమిటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఆఖరికి హోటల్ నుంచి తీసుకొచ్చే టీ తెచ్చుకునేందుకు సైతం పాలిథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. అందుకే ఏఇంట్లో చూసినా ప్లాస్టిక్ కవర్లు నిండిపోతున్నాయి. వాటిని నిర్లక్ష్యంగా ఆరు బయట పాడేస్తుండడంతో రోడ్లు, వీధులే కాదు ఆఖరికీ డ్రెయినేజీలు, వంట కాలువలు సైతం ప్లాస్టిక్ కవర్లతోనే దర్శనమిస్తున్నాయి. ప్రజలంతా కొనసాగిస్తున్న ఈ తప్పు భావితరాలకు పెనుముప్పుగా మారుతుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులొచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు.

నిబంధనలు బేఖాతరు

పర్యావరణ పరిరక్షణ చట్టం 2021 ప్రకారం 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువుల వాడకం పూర్తిగా నిషేధం అంతకంటే తక్కువ మందమున్న వాటితో నేల, నీరు, పర్యావరణం విషతుల్యంగా మారుతుంది. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా సంచులను తయారు చేయాలని, ప్రతి సంచిపై తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ సంఖ్య, మందం వివరాలు విధిగా ముద్రించాలని ప్రభుత్వం చెబుతోంది. నిబంధనలు పాటించని కంపెనీలకు, వాటిని విక్రయించే వ్యాపారులకు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి. అయినా ఆచరణలో ఇవేమీ అమలు కావడం లేదు.

ప్రత్యామ్నాయాలకు ప్రాధాన్యమివ్వాలి

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాలోని 11 మండలాల్లో సుమారు 950 వరకు వివిధ దుకాణాలు ఉన్నట్లు అంచనా. ప్రతి షాపులోను పాలిథిన్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. ఒక ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలసి పోవాలంటే వందలు, వేల ఏళ్లు పడుతుంది. ప్లాస్టిక్ కవర్ల వాడకానికి ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచిస్తుంది. అటువంటి వాటితో తయారు చేసే ఉత్పత్తులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పడాలంటే ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తెరగాల్సిన అవసరముంది. ప్రజలు క్యారీ బ్యాగ్‌లుగా జనపనార, క్లాత్ కాగితంతో తయారు చేసిన కవర్లను వాడితే భవిష్యత్ తరాలకు మంచి చేసినట్లవుతుంది.

సహజగుణం కోల్పోతున్న భూమి



పర్యావరణ కాలుష్యంతో భూమి నానాటికీ సహజ గుణాన్ని కోల్పోతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ క్లాత్‌తో తయారు చేసిన సంచులు తీసుకెళితే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించొచ్చు. మార్పు ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలి.

– జీవీ సరోవర్, ఎంపీడీఓ, అంబాజీపేట

ఆరోగ్యానికి హానికరం



ప్లాస్టిక్ అతి వినియోగం పర్యావరణానికే కాదు. మానవాళి ఆరోగ్యానికి, మనుగడకూ హానికరమే. ప్లాస్టిక్ నిషేధాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తే కాలుష్యాన్ని అధిగమించగలం. దీనిపై ప్రజలు మరింత చైతన్యవంతులు కావాలి

– కేఎన్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి, అంబాజీపేట

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఓ శాంతలక్ష్మి

ఆలమూరు: గ్రామాల్లో విస్తృతంగా తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ద్వారా ప్రత్యేక పారిశుధ్య చర్యలు పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.శాంతాలక్ష్మి అన్నారు. మండలంలోని పెదపళ్ల గ్రామ పంచాయతీని శనివారం ఆమె పరిశీలించారు. చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. పారిశుధ్య నిర్వహణను ఆరా తీశారు. వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా జరిగినప్పుడే పల్లెలు పరిశుభ్రతకు నెలవుగా మారతాయని ఆమె సూచించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీపీఓ ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాల పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఎ.రాజును ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యలు వస్తే సత్వరమే పరిష్కరించాలని డీపీఓ బి.శాంతలక్ష్మి కోరారు. గ్రామ పంచాయతీల్లో తాగునీటికి సంబంధించి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యదర్శి వి.వేణి, సర్పంచ్ ఏడిద సత్యశ్రీ, సలాది నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ ఏడిద మెహెర్, వీఆర్‌ఓ బుంగ ఉదయ్‌కుమార్, ఏఎన్‌ఎం సీహెచ్ ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం



నీటి బిందువుగా విద్యార్థుల ప్రదర్శన

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం ఏపీ ఎస్‌జీసీ స్టేట్ మానటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి ఆధ్వర్యంలో జరిగింది. భూగర్భ జలాలుపైన, సురక్షితమైన పారిశుధ్య సేవలు గురించి విద్యార్థులకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ, 1993 మార్చి 22న పరిశుభ్రమైన నీరు, పరిశుభ్రత అనే ఇతివృత్తంగా మొట్టమొదటిగా అంతర్జాతీయ జలదినోత్సవం జరిగిందన్నారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం భవిషత్తులో ఆయా ఏరియాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని తెల్పిందని, ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామంతో వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ఆమె తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ గ్రామంలో నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం జి.మల్లికార్జున రావు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

నీటి బిందువు ఆకారంలో విద్యార్థులు

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం వినూత్న ప్రదర్శన చేశారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నీటి బిందువుగా ఏర్పడి ఆకట్టుకున్నారు. నీటి విలువ చాలా ప్రధానమని తాగునీటిని వృథా కాకుండా వాడుకోవాలని ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులు తెలిపారు. పీవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆదరణ పథకం



అంబాజీపేటలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ఆదరణ పథకం–3లో అర్హులైన లబ్ధిదారులందరికీ వర్తిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన వెనుకబడిన వర్గాల్లో వివిధ కులవృత్తులకు చెందిన ఆదరణ–3 పథకం లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుల వృత్తిలో ఏ పరికరం, ఏ కంపెనీ కావాలన్నా సంబంధిత సచివాలయం ద్వారా తెలియజేయాలన్నారు. ఈ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ప్రభుత్వం ఆ పరికరాలను నేరుగా సచివాలయం ద్వారా లబ్ధిదారులకు అందించే అవకాశం ఉందన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో వెనుకబడిన వర్గాల కులవృత్తుల వారికి ఆదరణ–3 పథకం కింద ప్రభుత్వం రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. సదస్సులో వివిధ శాఖల అధికారులు, కుల వృత్తిదారులు పాల్గొన్నారు.

మండల ఉపాధ్యక్ష ఎన్నికలో అభ్యర్థిని పోటీలో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: ఈనెల 27న జరగనున్న పి.గన్నవరం మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నికలో వైఎస్సార్ సీపీ తరఫున అభ్యర్థిని పోటీలో నిలపాలని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం ఆయన పి.గన్నవరంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులతో గన్నవరపు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్ష ఎన్నిక పోటీ విధానంపై ఆయన అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు కొల్లే సూర్యనారాయణ, ముక్కామల భారతి, యాండ్ర విజయలక్ష్మి, కారుపల్లి సునీత, పులపర్తి రాజారావు, నాయకులు కుంపట్ల గోపి, దాసరి కాశీ, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహరావు, సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై అపరాల పంపిణీ



అపరాలు అందిస్తున్న సర్పంచ్ గంగాత్రివేణి

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడు, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై మినుములు, పెసలు పంపిణీ చేశారు. ఈ మేరకు మోరిపోడులో సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగా త్రివేణి, సఖినేటిపల్లిలంకలో సర్పంచ్ రేవూరి రాజేశ్వరి పంపిణీ చేశారు. కాగా దాళ్వా పంట అనంతరం వరి చేలల్లో మూడో పంట వేసుకునేందుకు మండల వ్యాప్తంగా మినుములు 11.12 క్వింటాళ్లు, పెసలు 8.4616 క్వింటాళ్లు వచ్చినట్టు ఏఓ పీవీ నరసింహారావు తెలిపారు. మినుములు కేజీ రూ.140 కాగా 50 శాతం రాయితీపై రూ.70కు, పెసలు కేజీ రూ.130 కాగా 50 శాతం రాయితీపై రూ.65 లకు అందజేస్తున్నట్టు ఏఓ అన్నారు. ఎంపీటీసీ బళ్ళ సుభాషిణి, రేవూరి ఏసు నరసింహారాజా, బళ్ల లక్ష్మణ్, అయిలూరి కామేశ్వరరావు, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ సిబ్బంది శ్వేత, స్వప్న, స్నిగ్ధ, యురేఖ, పెద్దలు పాల్గొన్నారు.

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: శని దోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. పూజలు, అభిషేకాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,70,490, అన్నప్రసాద విరాళాలుగా రూ.34,815 కలిపి మొత్తం రూ.2,05,308 ఆదాయం వచ్చిందని దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేయించాలి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు పారదర్శకంగా చేయించాలని డ్వామా ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పథకం మేట్లకు శిక్షణ ఇచ్చారు. మండల పరిధిలోని 60 మంది మేట్లు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ప్రతి కూలీకి 100 రోజులు పని దినాలు కల్పించాలని ఏపీడీ సూచించారు. రూ.300 వేతనం వచ్చే విధంగా పనులను చేయించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు పంపించాలన్నారు. ప్రతి రోజు రాత్రి 12 గంటల లోగా పంపించాలన్నారు. లేని పక్షంలో హాజరు నమోదు కాదన్నారు. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం ఫొటోలు తీయాలని చెప్పారు. పని ప్రదేశంలో ఫొటోలు మాత్రమే పంపించాలన్నారు. ఇతర ప్రదేశాల్లో ఫొటోలు పంపిస్తే శిక్షార్హులవుతారని చెప్పారు. ఉపాధి హామీ పనులను ప్రతి రోజు పరిశీలిస్తామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీఎం ఆర్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏపీఓ నాగప్రసాద్, జేఈ పేరాబత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పి.గన్నవరం: ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని ఏపీ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ ఉమ్మడి జిల్లా అడిషనల్ ప్రాజక్టు మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన పి.గన్నవరంలో వెలుగు, వ్యవసాయ, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నదని ఆయన వివరించారు. వీటిని చేనును కోసే ముందు చేనులో చల్లాలని వివరించారు. ఏపుగా ఎదిగిన అనంతరం పచ్చిరొట్టను దున్నేయాలని, ఇలా ధఫధఫాలుగా చేయడం ద్వారా చేను సారవంతం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఓ కళ్యాణ్ సూర్యకుమార్, వెలుగు ఏపీఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

అంబాజీపేట: మండలంలోని వివిధ గ్రామాల రేషన్‌కార్డుల లబ్ధిదారులు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పటికే మండలంలో ఉన్న రేషన్ డీలర్లకు తగు సూచనలు చేశామన్నారు. మండలంలో 19,152 మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరిలో ఇప్పటివరకు 80 శాతం మందికి ఈ–కేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన 20 శాతం మంది నమోదు చేయించాల్సి ఉందన్నారు. వచ్చే నెలలో నూతన రేషన్ కార్డులు వస్తాయని, అందువలన ముందుగా ఈ–కేవైసీ ఉన్నవారికే వచ్చే అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రంలో ఉన్నవారు ఈ–కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కార్డు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ–కేవైసీ పూర్తయిందా లేదా అని సంబంధిత రేషన్ డీలర్‌ను సంప్రదించాలన్నారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తుల తాకిడి అధికమవ్వడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆల యాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

నిండు శోకంతో హజ్రత్ అలీ షహదత్



మామిడికుదురులో గుమ్మటం ఊరేగింపులో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ అలీ షహదత్‌ను శనివారం ముస్లింలు నిండు శోకంతో నిర్వహించారు. నగరంలోని మొల్లా పంజా నుంచి గుమ్మటాన్ని తీసి మామిడికుదురు నుంచి నగరం పెద పంజీషా వరకు ఊరేగించారు. ఫర్హత్ అలీ బేగ్ ఆధ్వర్యంలో మర్షియా ఆలపించారు. నగరం పెద పంజీషాలో జరిగిన షహదత్ మజ్లిస్‌లో మత ప్రబోధకులు మెహదీ హసన్ బెహిష్తీ పాల్గొన్నారు. కూఫా పట్టణంలో హజరత్ అలీపై జరిగిన దాడిని మత ప్రబోధకులు బెహిష్తీ భక్తులకు వివరించగా కన్నీటి పర్యంతమయ్యారు. దీనిలో భాగంగా గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. షహదత్‌ను పురస్కరించుకుని మామిడికుదురు, నగరం, మొగలికుదురు గ్రామల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు జరిగాయి.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి



మలికిపురంలో క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఏఎస్పీ ప్రసాద్

మలికిపురం: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని జిల్లా అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మలికిపురం గౌతమ్ పాఠశాలలో జరిగిన 2025 స్పోర్ట్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. క్రీడా జ్యోతిని వెలిగించి విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, గాడి తప్పకుండా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎస్సై వీవీఎస్ సురేష్, సంస్థ ప్రతినిధులు సత్యనారాయణ, పప్పుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్ల సీజ్



రాజోలులో సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

రాజోలు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న 13 ట్రాక్టర్లను జిల్లా గనులు భూగర్భ శాఖాధికారులు శనివారం సీజ్ చేశారు. సోంపల్లిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు రావడంతో గనులశాఖ ఆర్‌ఐ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ రెహమాన్ ఆధ్వర్యంలో సోంపల్లి ర్యాంపులో ఉన్న 13 ట్రాక్టర్లను నిలుపుదల చేశారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను రాజోలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి హిమబిందు

రాజోలు: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు అన్నారు. శనివారం చింతలపల్లి గ్రామ పంచాయతీ వద్ద మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయమూర్తి హిమబిందు పలు చట్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టం, మహిళ రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవాధికార సభ్యురాలు జి.రజిత, పంచాయతీ కార్యదర్శి కె.రజని, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, మట్టా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: కరెంటు వైరును పట్టుకోవడంతో గాయపడిన నాలుగేళ్ల చిన్నారికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.18,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన కేతా లాస్యమాధురి రెండు నెలల క్రితం ఇంటి పైన కరెంటు వైర్‌ని పట్టుకోవడంతో పక్కనే ఉన్న తల్లి కేతా రమాదేవి కూతురిని రక్షించబోయి తీవ్రంగా గాయపడ్డారు. పాపకి వైద్యులు చేయి తొలగించారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇంటి దగ్గరే వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యులు రావులపాలెంలో కేతా రమాదేవికి రూ.18,500 చెక్కు అందజేశారు.